14

# ప్రజలు చేయు తప్పిదములు

## ప్రవక్తయైన ఎలీషా మరియు నయమాను

## (2 రాజులు 5)

ప్రతివారు తప్పులు చేస్తారు, కాని కొందరు ఇతరుల కంటె, తీవ్రంగా చేస్తారు. డాక్టరుతో కలువవలసినది మరచిపోతే అది తప్పు, కాని వివాహ వార్షికోత్సవం మరచిపోవటం తీవ్రమైన తప్పులు. 2 రాజులు 5లో దేవునితో సంబంధమున్న ప్రజలు తీవ్రమైన తప్పులు చేసిన కొన్ని ఉదాహరణలు మనం కనుగొంటాము.

### "దేవుని దీవెనలు మనకొరకే" అని ఆలోచించుట

మొదటి తప్పు, లేఖనాలలో నయమాను కథలో ఉన్నట్లు సూచిస్తుంది: కొంతమంది ఇశ్రాయేలీయులు దేవుని దీవెనలు ఇశ్రాయేలీయులకు మాత్రమే అని అనుకొంటున్నారు. సిరియా సైనాధికారియైన నయమాను కుష్ఠురోగమునుండి ఎలీషా స్వస్థపరచిన వృత్తాంతము 5వ అధ్యాయములో మనకు కనిపిస్తుంది. ఈ సంఘటన మరియు 1, 2 రాజులలో వివరించబడిన ఇతర సంఘటనలు దేవుని ప్రవక్తల యొక్క శక్తిని తెలియజేస్తున్నాయి. దేవుడు, ఎలీషా ద్వారా అప్పటికి ఇశ్రాయేలీయులతో ఎడతెగక యుద్ధములో ఉన్న సిరియా దేశస్థుని స్వస్థపరిచాడు. దేవుడు ఎప్పటికీ ఇశ్రాయేలీయుల దేవుడు మాత్రమే కాదు; ఆయన ఇతర దేశపు ప్రజలపై కూడ దయను చూపించాడు![1]

ఒక నిర్దిష్టమైన గుంపుకు చెందినవారిని – ఒక ప్రత్యేక దేశములోని, ఒక సాంఘిక తరగతకు చెందినవారిని, కులమువారిని లేక జాతివారిని మాత్రమే దీవిస్తాడని ఆలోచించి మనం కూడ తప్పు చేయవచ్చును!

### సహాయము కొరకు అయుక్తమైన మూలం వద్దకు పోవుట

నయమాను కథలో మనకు కనిపించే రెండవ తప్పు, సిరియా రాజు సహాయము కొరకు నయమానును ఇశ్రాయేలు రాజు నొద్దకు పంపుట, అనగా అయుక్తమైన వ్యక్తి యొద్దకు పంపుట. 2 రాజులు 5:1–7 చదువుదాము:

> సిరియారాజులు సైన్యాధిపతియైన నయమాను అను నొకడుండెను. అతనిచేత యెహోవాయే సిరియా దేశమునకు జయము కలుగజేసియుండెను[2]. గనుక అతడు తన యజమానుని దృష్టికి ఘనుడై దయపొందినవాడాయెను. అతడు మహా పరాక్రమశాలియైయుండెనుగాని అతడు కుష్ఠరోగి. సిరియనులు గుంపులు గుంపులుగా బయలుదేరి ఇశ్రాయేలు దేశము మీదికి పోయియుండిరి. వారచ్చటనుండి ఒక చిన్న దాని చెరగొని తేగా, అది నయమాను భార్యకు పరిచారము చేయుచుండెను. అది – షోమ్రోనులో నున్న ప్రవక్త దగ్గర నా యేలినవాడుండవలెనని నేనెంతో కోరుచున్నాను; అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగము బాగుచేయునని తన యజమానురాలితో

అనెను. నయమాను రాజునొద్దకు పోయి ఇశ్రాయేలు దేశపు చిన్నది చెప్పిన మాటలను అతనికి తెలియజేయగా సిరియారాజు నేను ఇశ్రాయేలు రాజునకు దూత చేత పత్రిక పంపించెదనని ఆజ్ఞ ఇచ్చెను గనుక అతడు ఇరువది మణుగుల వెండియు. లక్ష ఇరువది వేలు రూపాయల బంగారును పది దుస్తుల బట్టలను తీసుకొనిపోయి ఇశ్రాయేలు రాజునకు పత్రికను అప్పగించెను.

ఆ పత్రికలో ఉన్న సంగతి యేదనగా – నా సేవకుడైన నయమానునకు కలిగిన కుష్ఠరోగమును నీవు బాగుచేయవలెనని ఈ పత్రికను అతనిచేత నీకు పంపించి యున్నాను. ఇశ్రాయేలు రాజు ఈ పత్రికను చదివి వస్త్రములు చింపుకొని – చంపుటకును బ్రతికించుటకును నేను దేవుడనా?[3] ఒకనికి కలిగిన కుష్ఠరోగమును మాన్పుమని నా యొద్దకు ఇతడు పంపుటయేమి? నాతో కలహమునకు కారణము అతడు ఎట్లు వెదకుచున్నాడో మీరు అలోచించుడనెను.

ఒక వేళ నయమాను పనిపిల్ల సందేశాన్ని అపార్థం చేసుకొని ఉండి ఉండవచ్చును లేక నయమాను ఏమి చెప్పాడో దానిని రాజు జాగ్రత్తగా విని ఉండడు.[4] కారణమేదైనప్పటికి, రాజు నయమానును స్వస్థపరచబడుటకు తప్పు స్థలానికి పంపించాడు!

ప్రజలు తరచూ తప్పు స్థలాలలో సహాయం కొరకు వెదుకుతారు. మన పాపములకు స్వస్థత అవసరమైనపుడు – భవిష్యత్తులో మన జీవితాన్ని నిరీక్షణను పరిపూర్ణం చేసుకోవలనుకొన్నప్పుడు – మనం ఏవో కొన్ని తప్పు మతాలలోనికో, మత్తుమందులకో మద్యపానానికో, లేక వినోదాలకో వెళ్ళకూడదు. పాపానికి ప్రాయచిత్తం కేవలం క్రీస్తులో మాత్రమే ఉంది!

అప్పుడప్పుడు, అమెరికా పౌరులు మరియు ఇతర ప్రజాస్వామ్య దేశాలవారు తీవ్రమైన రాజకీయ ఎన్నికల కార్యక్రమములలో మునిగి ఉంటారు. ఆ సందర్భాలలో ఎన్నిక కాబడిన అభ్యర్థులు వారి దేశాలకొరకు మరియు ప్రజల జీవితాల కొరకు అనుకూల నిర్ణయాలు తీసుకోవచ్చును. అయినప్పటికి, ఎన్నికలలో గెలిచినవారిని బలపరచటం, యేసు క్రీస్తులో నీ ఆత్మ రక్షణను కనుగొనుట మంత ప్రాముఖ్యమైనది కాదు! జీవ మరణ సమస్యలకొరకు చివరిగా నీవేదైనా రాజకీయ పార్టిని వెదకినట్లయితే, నీవు తప్పు స్థలాన్ని వెదకుతున్నావు! నీ దృష్టి యేసు వైపునకు త్రిప్పు!

## దేవుని సందేశాన్ని తిరస్కరించుట

సాధారణంగా జరిగే మూడవ తప్పు, మొదట నయమాను తన స్వస్థతకు సంబంధించి ప్రవక్త సందేశాన్ని తిరస్కరించినట్లు గ్రంథం మనకు వివరిస్తుంది. అతని ఆలోచన 2 రాజులు 5:8–14లో వివరించబడినది:

ఇశ్రాయేలు రాజు తన వస్త్రమును చింపుకొనిన సంగతి దైవజనుడైన ఎలీషాకు వినబడినప్పుడు అతడు – నీ వస్త్రములు నీవెందుకు చింపుకొంటివి? – ఇశ్రాయేలులో ప్రవక్తయొకడున్నాడని అతనికి తెలియబడునట్లు అతని నా యొద్దకు రానిమ్ము అని రాజునకు వర్తమానము చేసెను. నయమాను గుఱ్ఱములతోను రథములతోను వచ్చి ఎలీషా ఇంటి ద్వారము ముందర నిలిచియుండగా ఎలీషా – నీవు యొర్దాను నదికిపోయి ఏడుమారులు స్నానము చేయుము, నీ వళ్ళు మరల బాగై నీవు శుద్ధుడవగుదువని అతనితో చెప్పుటకు ఒక దూతను పంపెను. అందుకు నయమాను కోపము తెచ్చుకొని తిరిగి పోయి ఇట్లనెను

> – అతడు నా యొద్దకు వచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమును బట్టి తన చెయ్యి రోగమున ఉన్న స్థలముమీద ఆడించి కుష్ఠరోగమును మాన్పునని నేననుకొంటిని. దమస్కు నదులైన అబానాయనును ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నిటి కంటె శ్రేష్ఠమైనవి కావా? వాటిలో స్నానము చేసి శుద్ధి నొందలేనా అని అనుకొని రౌద్రుడై తిరిగి వెళ్లి పోయెను. అయితే అతని దాసులలో ఒకడు వచ్చి – నాయనా, ఆ ప్రవక్త యేదైన నొక గొప్ప కార్యము చేయుమని నియమించిన యెడల నీవు చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్మను మాట దానికంటె మేలు కాదా అని చెప్పినప్పుడు అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను.

"ఎందుకు? నీళ్లెందుకు?" "యొర్దాను నదే ఎందుకు? ఏడు సార్లు ఎందుకు?" అని మనం నయమానుతో పాటు ఆశ్చర్యపోవచ్చును. జవాబు "మనకు తెలియదు!" వేడు కోవటం అర్థంలేనిదను నయమాను ఆలోచన సరైనదే. మానవ దృక్పథం నుండి, శుద్ధుడగుటకు అది న్యాయబద్ధమైన పద్ధతి కాదు. అయినప్పటికి, అది దేవుని ఆజ్ఞ, మరియు సిరియా సైన్యాధిపతి దానికి విధేయత చూపుటకు అంగీకరించాడు!

ఈ కథలో మరల నయమాను సేవకులు ప్రాముఖ్యమైన పాత్రను పోషించారు. వారు సేవకులైనప్పటికి, తమ యజమానికన్న అధిక జ్ఞానం కలిగియున్నారు. వారి తర్కము ముట్టడింపదగినది కాదు. వారు ప్రాథమికంగా, "ఆ ప్రవక్త యేదైన నొక గొప్ప కార్యము చేయమని నియమించినయెడల నీవు చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్మను మాట దానికంటె మేలు కాదా" అని చెప్పారు. వారి యజమాని స్వస్థపడాలని వారి కోరిక, మరియు స్వస్థపడతాడని వారి నమ్మకం. వారి మాట వినుటకు ఇష్టపడటం నయమాను నమ్మకం. అతడు తన స్థితిని తిరిగి బేరీజు వేసుకొని, ప్రవక్త ఇచ్చిన ఆజ్ఞకు విధేయత చూపి, స్వస్థత పొందాడు!

దానిని మన కాలములో సమాంతరంగా చూడటం తేలిక. నేడు దేవుడు ఏమి చెబుతున్నాడు? విశ్వసించి మారుమనస్సు పొందిన వారికి ఆయన "లేచి బాప్తిస్మము పొంది నీ పాపములు కడిగివేసుకొనుము" (అపొస్తలుల కార్యములు 22:16; చూడుము 2:38; 10:48) అని చెప్పాడు. రక్షణ పొందవలసిన అవసరం ఉన్నవారికి దేవుడు, "వెళ్లు … బాప్తిస్మం పొందు!" అని చెబుతున్నాడు. జవాబుగా మనమేమి చెబుతాము? "రక్షింపబడుటకు నీళ్ళలోనికి దిగవలసిన అవసరం లేదు" అని చెబుతారు. అయినప్పటికి, నయమాను నీళ్ళలో మునిగే వరకు అతని కుష్ఠరోగము నయము కానట్లు, మనం బాప్తిస్మంలో నీళ్ళలో మునగనంత కాలం మన పాపాలను కడిగి వేసుకోలేము.

## దేవుని స్వభావాన్ని అర్థం చేసుకొనుటలో తప్పిపోవుట

గ్రంథం చిత్రించిన నాలుగవ తప్పు, దేవుడు ఇశ్రాయేలు భూమికి మాత్రమే సంబంధించిన స్థానిక దేవుడని నయమాను అనుకొన్నాడు. అతడు వింతైన మనవి చేశాడు:

> అప్పుడతడు పరివారముతో కూడ దైవజనుని దగ్గరకు తిరిగివచ్చి అతని ముందర నిలిచి – చిత్తగించుము; ఇశ్రాయేలులో నున్న దేవుడు తప్ప లోకమంతటియందును మరియొక దేవుడు లేడని నేను ఎరుగుదును; ఇప్పుడు నీవు నీ దాసుడనై నా యొద్ద బహుమానము తీసుకొనవలసినదని అతనితో చెప్పగా ఎలీషా – ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో,

> ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా జీవముతోడు నేనేమియు తీసికొనను అని చెప్పెను. నయమాను అతనిని ఎంతో బతిమాలినను అతడు ఒప్పకపోయెను. అప్పుడు యెహోవాకు తప్ప దహనబలినైనను మరి యే బలియైనను ఇతరమైన దేవతలకు నేనికను అర్పింపను; రెండు కంచరగాడిదలు మోయుపాటి మన్ను నీ దాసుడనైన నాకు ఇప్పించకూడదా? నా యజమానుడు మ్రొక్కుటకు రిమ్మోను గుడిలో చొచ్చి నా చేతి మీద అనుకొనునప్పుడు, నేను రిమ్మోను గుడిలో నమస్కారము చేసిన యెడల, రిమ్మోను గుడిలో నేను నమస్కారము చేసిన సంగతిని గూర్చి యెహోవా నీ దాసుడనైన నన్ను క్షమించును గాకని నయమాను చెప్పగా ఎలీషా – నెమ్మది కలిగి పొమ్మని అతనికి సెలవిచ్చెను. అతడు ఎలీషా యొద్దనుండి వెళ్లి కొంత దూరము సాగిపోయెను (2 రాజులు 5:15–19).

ఎలీషా బహుమానము ఎందుకు అంగీకరించలేదని మనం ఆశ్చర్యపోవచ్చును. ఒక వేళ, అబద్ధ ప్రవక్తలు డబ్బు కొరకు ప్రవచిస్తారు కాబట్టి ఆ కారణముతో ఈయన వారితో పోల్చుకొనుటకు ఇష్టము లేక తీసుకోలేదు. ఇతర సాధ్యతలు కూడ ఉనికిలో ఉన్నాయి.

నయమాను నిజదేవుని వైపు మారినట్లు స్పష్టమవుతుంది; అతడు, "ఇశ్రాయేలులో నున్న దేవుడు తప్ప లోకమంతటియందును మరి యొక దేవుడు లేడని నేను ఎరుగుదును" అన్నాడు (5:15). అయినప్పటికి, దేవుని గూర్చి అతని ఉద్దేశాలలో రెండు మార్గాలలో తప్పిపోయినట్లు అతడు తెలియజేస్తున్నాడు. (1) తన యజమానుడు రిమ్మోను గుడికి వెళ్లినప్పుడు అతనితో రిమ్మోను గుడికి వెళ్లితే దేవుడు క్షమించాలని అడిగాడు. (2) అతడు దేవుని ఆరాధించుటకు ఇశ్రాయేలు ప్రాంతం నుండి మట్టి కావాలను కొన్నాడు. స్పష్టంగా, అతని దృక్పథం ఆ యుగానికి మాదిరిగా ఉంది. ఒక దేవత అతని/ఆమె యొక్క శక్తి ఒక ప్రత్యేక ప్రాంతానికి అనగా ఆ దేవతా, దాని ఆరాధికులు ఏ ప్రాంతంలో నివసిస్తారో ఆ ప్రాంతానికి పరిమితమని ఆలోచించబడినది. దేవుని ఆరాధించుటకు, నయమాను ఒకడు ఇశ్రాయేలు మట్టి మీదే దేవుని ఆరాధించాలి అనుకొన్నాడు. దేవుని మీద అతనికి కొంత విశ్వాసమున్నప్పటికి, నిజ దేవుని స్వభావాన్ని అతడు అర్థం చేసుకోలేదు. (1) దేవుని ఆరాధించువారు వేరే ఏ ఇతర దేవుని ఆరాధించుటకు ఆయన అనుమతించడు. (2) దేవుడు ఇశ్రాయేలు ప్రాంతమునకు మాత్రమే చెందినవాడు కాడు, లేక ఏ ఇతర స్థలానికి చెందినవాడు కాడు. ఆయన అంతట ఉన్నవాడు! ఒకడు ఎక్కడ ఉన్న అతడు అక్కడ దేవుని ఆరాధించవచ్చును.

కొన్ని సార్లు దేవుని గూర్చిన ఈ వాస్తవాలను మనం గుర్తుచేయవలసిన అవసరం ఉంది. మనం ప్రభువైన యెహోవాతో పాటు ఇతర దేవతలను కూడ ఆరాధించవచ్చని ఆలోచిస్తాము. మనం దేవుడు ఒక స్థలానికి – టెక్సాస్, లేక మసాచూసెట్స్, లేక న్యూ సౌత్‌వేల్స్, లేక అలబామా లాంటి ఒక స్థలానికి పరిమితం అనుకోవచ్చును, మరియు మనము ఆ ప్రాంతంనుండి వేరే ప్రాంతం వెళ్లినప్పుడు, దేవుని ఆరాధించవలసిన అవసరం లేదు లేక దేవుని ఆరాధించలేము అనుకొంటాము.

## పాప ఫలితాలను తక్కువగా అంచనా వేయటం

గేహాజీ – ఎలీషా సేవకుడు – పట్టబడకుండ, శిక్షింపబడకుండ అబద్ధం ఆడవచ్చనే ఆలోచన అయిదవ తప్పుగా మనం గ్రంథంలో చదువుతాము. 2 రాజులు 5:20–27లో అతని భాగానికి సంబంధించిన కథ చెప్పబడినది.

అంతట దైవజనుడైన ఎలీషాకు సేవకుడగు గేహజీ – సిరియనుడైన ఈ నయమాను తీసుకొని వచ్చిన వాటిని అంగీకరించుటకు నా యజమానునికి మనస్సు లేకపోయెను గాని, యెహోవా జీవముతోడు నేను పరుగెత్తుకొని పోయి అతనిని కలిసికొని అతనియొద్ద ఏదైనను తీసుకొందుననుకొని నయమానుని కలిసికొనుటకై పోవుచుండగా, నయమాను తన వెనుక నుండి పరుగున వచ్చుచున్న వానిని చూచి తన రథము మీద నుండి దిగి వానిని ఎదుర్కొని – క్షేమమా అని అడిగెను. అతడు – క్షేమమే అని చెప్పి – నా యజమానుడు నా చేత వర్తమానము పంపి – ప్రవక్తల శిష్యులలో ఇద్దరు యౌవనులు ఎఫ్రాయిము మన్యమునుండి నా యొద్దకు ఇప్పుడే వచ్చిరి గనుక నీవు వారి కొరకు రెండు మణగుల వెండియు రెండు దుస్తుల బట్టలును దయచేయుమని సెలవిచ్చుచున్నాడనెను. అందుకు నయమాను – నీకు అనుకూలమైతే రెట్టింపు వెండి తీసుకొనుమని బతిమాలి, రెండు సంచులలో నాలుగు మణుగుల వెండి కట్టి రెండు దుస్తుల బట్టలనిచ్చి, తన పనివారిలో ఇద్దరి మీద వేయగా వారు గేహజీ ముందర వాటిని మోసుకొనిపోయిరి. మెట్ల దగ్గరకు రాగానే వారి యొద్ద నుండి గేహజీ వాటిని తీసుకొని ఇంటిలో దాచి వారికి సెలవియ్యగా వారు వెళ్లిపోయిరి. అతడు లోపలికి పోయి తన యజమానుని ముందర నిలువగా ఎలీషా వానిని చూచి – గేహజీ, నీవెచ్చటనుండి వచ్చితివని అడగినందుకు వాడు – నీ దాసుడనైన నేను ఎచ్చటికి పోలేదనెను.

అంతట ఎలీషా వానితో – ఆ మనుష్యుడు తన రథము దిగి నిన్ను ఎదుర్కొనుటకు తిరిగి వచ్చినప్పుడు నా మనస్సు నీతో కూడ రాలేదా? ద్రవ్యమును వస్త్రములను ఒలీవచెట్ల తోటలను ద్రాక్ష తోటలను గొఱ్ఱెలను ఎడ్లను దాసదాసీలను సంపాదించుకొనుటకు ఇది సమయమా?[5] కాబట్టి నయమానునకు కలిగిన కుష్ఠు నీకును నీ సంతతికిని సర్వకాలము అంటియుండును అని చెప్పగా వాడు మంచువలె తెల్లనైన కుష్ఠము కలిగి ఎలీషా ఎదుట నుండి బయటికి వెళ్ళెను.

ఈ వస్తువుల వెంట పరిగెత్తుటకు గేహజీకి ఏది కారణమయింది? అత్యాశ లేక లోభమా! నయమాను తెచ్చిన వస్తువులన్నిటిని పోల్చి, అతడు కొంచెమే అడిగాడు అని సూచించుట ద్వారా ఒకడు అతని పక్షంగా సాకు చెప్ప ప్రయత్నించవచ్చును. అయినప్పటికి, ఎలీషా దానినంతటిని తిరస్కరించినప్పుడు, ఏ కొద్ది మొత్తమైనా ఎక్కువే అవుతుంది! ఏ రకమైన పాపమైనా ఈనాడు అదేరకమైన లోభత్వము నుండి పుడుతుంది. వాస్తవానికి, పౌలు చెప్పినట్లుగా, “ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము” (1 తిమోతి 6:10).

అత్యాశ, లోభత్వము గేహజీని మరొక పాపము చేయటకు నడిపించింది: అతడు అబద్ధమాడాడు! ఒక పాపం మరొక పాపానికి నడిపిస్తుంది, గేహజీ లోభత్వము అను పాపము అతనిని అబద్ధమాడు పాపమునకు నడిపించింది. మోషే ధర్మశాస్త్ర ప్రకారము అబద్ధమాడుట పాపము, మరియు అది ఈనాడు కూడ తప్పే. అబద్ధికులు అగ్ని గంధకములతో నుండు గుండములో పాలుపొందుతారు (ప్రకటన 21:8).

గేహజీ గొప్ప తప్పిదమేమంటే, అతడు దురాశపడటమో, అబద్ధమాడటమో కాదుగాని, ఆ తప్పు క్రియల ఫలితాన్ని తప్పించుకొనగలనని ఆలోచించటం! మనం పాపం చేసినా ఎవరికి తెలియదులే, ఎవరూ మనలని కనుగొనలేరులే అనుకొన్నప్పుడు ఆ తప్పులో మనం భాగస్తుల మవుతాము. ఏ మానవునికి తెలియక పోయినప్పటికి, దేవునికి తెలుసు! మన పాపములకు శిక్ష పొందకుండ మనం తప్పించుకోలేము! వాటి కొరకు మనం క్షమాపణ వెదకి పొందక పోయినట్లయితే, మనం వాటికి జవాబు చెప్పవలసి ఉంటుంది! మనం

అపరిశుద్ధతతో పాపము చేయవచ్చు అని అనుకొని తప్పు చేయకూడదు.

## సంగ్రహము

నయమాను కథలో కనుగొనబడిన తప్పులలో, నీవు ఏదైనా చేశావా లేకా చేస్తున్నావా?

- నీ గుంపులో ఉన్న ప్రజలపట్ల మాత్రమే దేవుడు ఆసక్తి కలిగి ఉన్నాడు లేక ప్రేమిస్తున్నాడు అని నీవనుకొంటున్నావా?
- జీవమరణ సమస్యల పరిష్కారం కొరకు చివరిగా నీవు, సరైన మూలమైన యేసు (యోహాను 14:6) నొద్దకు కాకుండ, తప్పు మూలముల యొద్దకువెళ్లావా?
- రక్షింపబడుటకు నీటిలో ముంచబడుట, నీకు ఏ అర్థాన్ని ఇవ్వలేదని దేవుని చిత్తాన్ని జరిగించుటలో ఆశాభంగం చెందావా?
- దేవుడు అంతటా ఉన్నాడని అర్థం చేసుకొనుటకు బదులు, ఆయన ఒక ప్రాంతమునకు పరిమితమయ్యాడని ఆలోచిస్తున్నావా?
- నీవు దురాశపరుడవో, అబద్ధికుడవో అయిఉండి లేక పాపముతో ఎలాగోలా కొనసాగవచ్చులే అని ఆలోచిస్తున్నావా?

ఈ తప్పులలో నీవేదైనా చేసినట్లయితే, నీవు క్షమింపబడవచ్చును. రక్షింపబడుటకు విధేయతతో మరియు విశ్వాసముతో ఆయన వైపునకు తిరుగుటకు ఇష్టపడినవారిపట్ల ఆయన ఎల్లప్పుడూ దయ చూపుతాడు.

ముఖ్యంగా, నీవు నయమానులాగా "ముంచబడి" శుద్ధుడవగుటకు తిరస్కరించుచున్నావా? "దేవుడు నీలో ఏదైనా ప్రత్యేకంగా కనిపించేదాని గురించి అడిగినట్లయితే ఏం చేయాలి?" అని నిన్ను నీవు ప్రశ్నించుకో. ఒక వేళ, దేవుడు నిన్ను ఐదు మైళ్ళు పరుగెత్తమన్నాడు లేక రక్షింపబడుటకు కొంత డబ్బు కట్టమన్నాడు అనుకొందాము. నీవు ఆ ఐదు మైళ్ళు పరుగెత్తుటకు లేక ఆ ధనం సంపాదించుటకు మార్గము కనుగొనవా? అలాంటప్పుడు, అతి సాధారణమైన బాప్తిస్మము పొందుటకు నీవెందుకు సంకోచిస్తున్నావు?

నీ పాప క్షమాపణ కొరకు నీళ్లలో ముంచబడుటకు ఇక ఎంత మాత్రమును కాదనకుము. నయమాను మాదిరి అనుసరించుము. మొదట అతడు సంకోచించాడు, కాని దేవుని వర్తమానికుడు చెప్పింది చేశాడు అతడలా చేసినప్పుడు, అతడు స్వస్థపరచబడ్డాడు! దేవుడు చెప్పేది చేయుము! క్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందు, మరియు బాప్తిస్మము పొందుము! అప్పుడు నీవు నయమాను వలె శుద్ధుడవుతాము. నీ ఆత్మ స్వస్థపరచబడుట నీవు కనుగొంటావు.

---

సూచనలు

[1]లూకా 4:27, 28లో అలాంటి ఉద్దేశం కొరకు యేసు ఈ కథను ఉపయోగించాడు. [2]"రెండవ రాజులు" ప్రభువైన యెహోవా సిరియనుడైన నయమానుకు (ఇతడు దేవుని ప్రజలలో ఒకడు కాడు) విజయాన్ని ఇచ్చినట్లు చెబుతుంది. బైబిలు రచయితలు ఏమి జరిగినా అది దేవుని వలన జరిగిందని నమ్మారు! నయమాను ఇశ్రాయేలీయులపై గెలచినా, దేవుడే ఆ గెలుపు అతనికిచ్చాడు గనుక అతడు గెలిచాడు. [3]మరల ఏదైనా జరిగితే అది దేవుడు చేశాడనే సూత్రాన్ని మనం చూస్తున్నాము, దేవుడు

చంపుతాడు, బ్రతికిస్తాడు అని సూచిస్తుంది. [4]డేవిడ్ కోపర్ మరొక సాధ్యతను సూచిస్తున్నాడు: సిరియా రాజు, స్వస్థపరచగల ప్రవక్తను కలుసుటకు, రాజ్యసంబంధ మార్గం ద్వారా ఏర్పాట్లు చేయాలి అనుకొన్నాడు; అతను రాజు ద్వారా ప్రవక్తను కలవాలనుకొన్నాడు. (David Roper, "The Man Who Blessed a Life," in "Elisha" *Truth for Today*.) [5]గేహజీ పొందిన వెండి, బట్టలు, "ఆలీవు తోటలు, ద్రాక్షతోటలు, గొఱ్ఱెలు, ఎడ్లు, మరియు స్త్రీ, పురుష సేవకులను కొనుటకు సరిపోతాయని," డేవిడ్ రోపర్ గమనించాడు. (David Roper, "A Man Whose Life Was Cursed," in "Elisha," *Truth for Today.*)